క్లుప్తంగా

స్వామివారికి వెండి పుష్పాలు బహూకరణ



స్వామి వారికి సమర్పించిన వెండి పుష్పాలు, గంట, శంఖు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పరిధిలోని పడిగరాయి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి అజ్ఞాత దంపతులు రూ.లక్ష విలువ గల 1,008 వెండి పుష్పాలను సోమవారం ఆలయ పాలక వర్గానికి బహూకరించారు. అదే విధంగా శివుడికి వెండి గంట, శంఖులను సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజ, ఆంజనేయ స్వామికి ఆకు పూజ జరిపించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, పాలక వర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఎల్‌టీ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించేందుకు మంగళవారం పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మఠంపల్లి రోడ్డు, రెడ్డి బజార్ ఏరియాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బియ్యం పంపిణీ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని అంబేద్కర్ కాలనీకి చెందిన షేక్ జాకీర్ హుస్సేన్ కొడుకు రేహన్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం పట్టణంలోని అరబ్బీ మద్రస హాస్టళ్లకు ఓపెన్ ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో 75 కేజీల బియ్యాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సులువ శ్రీను, దస్తగిరి, చందు, లక్ష్మణ్, కృష్ణ, శివశంకర్, కలాం, సంపత్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయ 6వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరం గ్రామంలో గల హరిహర క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, జలాభిషేకం, పంచామృతం, బోనాల ఊరేగింపు, బొడ్రాయికి అభిషేకాలు, ముత్యాలమ్మ, మారెమ్మల ఆలయాల వద్ద దూపదీప నైవేద్యములతో పాటు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

ఘనంగా నర్సుల దినోత్సవం



నేరేడుచర్ల పీహెచ్‌సీలో నర్సులను సన్మానిస్తున్న వాసవీ, వనితా క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమవారం నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నర్సులను సత్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నాగిని, వాసవీ, వనిత క్లబ్‌ల అధ్యక్షులు లక్ష్మీనర్సింహారావు, లక్ష్మీ ప్రసన్న, సభ్యులు అశోక్, శ్రీనివాస్, లక్ష్మణ్, శ్రీనివాస్‌రావు, శ్రీలత, నటరాజ్, గోపాలకృష్ణ, పరమేశం, మోహన్, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రచారం

అర్వపల్లి : పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని ఆ కళాశాల ప్రధానాచార్యుడు పెరుమాళ్ల యాదయ్య కోరారు. సోమవారం కళాశాల ఆధ్వర్యంలో అర్వపల్లిలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. కళాశాలలో ఉన్న కోర్సుల ప్రత్యేకత, కళాశాలలో సౌకర్యాలు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి. శ్రీనివాస్, జి.వెంకట్‌రెడ్డి, బోయిని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధర పైపైకి...

- స్కిన్‌తో కిలో రేటు రూ.270.. స్కిన్‌లెస్ రూ.290
- ఇంకా ధర పెరగొచ్చంటున్న వ్యాపారులు
- వేసవిలో కోళ్ల పెంపకానికి పెరిగిన ఖర్చులే కారణం

కోదాడరూరల్ : బాయిలర్ కోడి మాంసం ధర చుక్కలనంటుతోంది. కొన్ని వారాలుగా కోడి మాంసం ధర పెరుగుతూ వస్తుంది. మార్కెట్‌లో స్కిన్‌తో కేజీ రూ.270, స్కిన్ లెస్ రూ.290 ధర పలుకుతోంది. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా కోళ్ల పెంపకం గతంలో కంటే తగ్గింది. ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటుండడం, దీనికి తోడు కోళ్ల ఉత్పత్తి కూడా తక్కువగా ఉండి ధరల పెరుగుదలకు కారణమైందని వ్యాపారులు పేర్కొంటున్నారు. వాతావరణం పూర్తి స్థాయిలో చల్లబడితే కోళ్ల పెంపకానికి అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం దుకాణాల్లో అమ్మకాలు సైతం తగ్గాయి. మరో నెల రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని భావిస్తున్నారు. తద్వారా కోడి మాంసం ధర పెరిగే అవకాశం లేకపోలేదు. ధర బాగా పెరగడంతో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



పెంపకంలో ఉన్న కోళ్లు

పెరిగిన పెంపకం ఖర్చులు

కరోనా తర్వాత ప్రజలు మాంసహార వాడకాన్ని పెంచారు. మాంసహారంలో కూడా చికెన్‌నే ఎక్కువగా వినియోగిస్తున్నారు.దీంతో ప్రస్తుతం వినియోగదారులకు డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో రికార్డు స్థాయిలో ధరల పెరుగుదలకు కారణమైంది. ఎండకాలం కావడంతో పెరిగిన ఉష్ణోగ్రతలకు కోళ్ల ఎదుగుదలకు ఎక్కువ సమయం పడుతోంది. దీంతో కోళ్ల ఉత్పత్తికి సాధారణం కంటే ఎక్కువ రోజులు పడుతుంది. పలు చోట్ల ఎండకు తట్టుకునేందుకు కోళ్లకు కూలర్లు, నీటి స్ప్రింక్లర్‌లు ఏర్పాటు చేశారు. ఇక కోళ్లకు దాణాగా ఉపయోగించే మొక్కజొన్న, సోయ, తవుడు వంటి వాటి ధరలు కూడా పెరిగాయి. ఈ ప్రభావాలతో చికెన్ ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు తెలిపారు. అయితే, ఈ ఏడాది జనవరిలో స్కిన్ రూ.200 స్కిన్‌లెస్ రూ.220 ఉన్న చికెన్ ధర ప్రస్తుతం రూ.270 నుంచి రూ.290 వరకు ఉంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రూ.350 దాటే అవకాశం ఉందని అంటున్నారు.

తినడం తగ్గించాం



ధర పెరగకముందు వారంలో రెండు రోజులు చికెన్‌ను వినియోగించేది. ప్రస్తుతం పెరిగిన ధరలతో రెండు వారాలకు ఓ సారి మాత్రమే చికెన్ తింటున్నాం. బాయిలర్ చికెన్ బదులుగా చేపలు, నాటుకోడి తెచ్చుకుంటున్నాం.

– షేక్.రఫీ, గుడిబండ

చికెన్ ధర ఇంకా పెరగొచ్చు



డిమాండ్‌కు సరిపడా కోళ్ల ఉత్పత్తి లేకపోవడంతోనే చికెన్ ధరలు పెరగుతున్నాయి. ఎప్పుడైనా వేసవి కాలంలో ధర ఎక్కువగానే ఉంటుంది. కానీ ఈ ఏడాది ఏప్రిల్‌లోనే స్కిన్‌లెస్ కిలో ధర రూ.300కు చేరింది. ఈ ధర ఇంకా పెరగొచ్చు.

– గొర్రె నరేందర్, చికెన్ షాప్ నిర్వాహకుడు, కోదాడ.

చిరు జల్లులకే వీధులు జలమయం

- డ్రెయినేజీల్లో పూడిక తీయకపోవడంతో రోడ్లపైనే పారుతున్న మురుగు నీరు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని కొన్ని వీధులు చిన్నపాటి వర్షాలకే జలమయమవుతున్నాయి. పట్టణంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి కొన్ని వీధుల్లో నీరు నిల్వలగా మరికొన్ని చోట్ల రోడ్లవెంట పారింది. డ్రెయినేజీల్లో పూడిక తీయకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు ఆ నీరు రోడ్ల వెంట పారుతుదంని పట్టణ ప్రజలు అంటున్నారు. మరి కొన్నిచోట్ల డ్రెయినేజీల నిర్మాణంలో శాస్త్రీయత లోపించడం కూడా ఓ కారణంగా పేర్కొంటున్నారు. రోడ్డు కిందకు..డ్రెయినేజీ పైకి ఉండటంతో ఆ నీరు ఏటుపోయే మార్గం లేక వీధుల్లోనే నిలుస్తోంది. పట్టణంలోని అంజలి స్టూడియో రోడ్డులో ఏ చిన్న వర్షం కురిసిన రెండు మూడు రోజుల వరకు ఆ నీరు అలాగే ఉంటుందని ఆ వీధి ప్రజలు తెలిపారు. వీధిలో నీరు నిలుస్తున్న అధికారులు కనీసం అటువైపు చూడటం లేదని, రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వర్షాకాలంలో డ్రెయినేజీలను శుభ్రం చేయడంతో పాటు వర్షపు నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కోదాడ పట్టణంలోని ఓ వీధిలో నిలిచిన నీరు

‘ఉపాధి హామీ’ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర



పనిచేస్తూ కూలీలతో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

కోదాడరూరల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. సోమవారం కోదాడ మండల పరిధిలోని గుడిబండలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద ఆయన కూలీలతో మాట్లాడారు. అందులో భాగంగానే కూలీలకు సరైన పని దినాలు కల్పించడం లేదన్నారు. కూలీలకు పనిచేసే చోట సౌకర్యాలు కల్పించాలన్నారు. వేసవిలో కూలీలకు టెంట్‌తో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని కోరారు. పని చేసిన కూలీలకు వెంటనే వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం రోజుకు నాలుగు వందలకు పెంచి సంవత్సరంలో 200 పనిదినాలు కల్పించాలన్నారు.

కష్టపడి చదివితేనే సత్ఫలితాలు

కోదాడ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్ సూచించారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఎంఎస్ కళాశాలలో అంబేడ్కర్ ఆశయ సాధన కేంద్రం (ఆస్క్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పదవ తరగతి తరువాత ఐదారు సంవత్సరాలు విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఆస్క్ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బల్గూరి స్నేహ, మాతంగా ప్రభాకర్,శౌరి, కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



నాగేందర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని వినతి

హుజూర్‌నగర్‌రూరల్ : ఇళ్ల స్థలాలను వ్యవసాయ భూములుగా మార్చి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసిన అప్పటి తహసీల్దార్ జయశ్రీపై చర్య తీసుకోవాలని కోరుతూ హుజూర్‌నగర్ మండలం అమవరం ఆవాస గ్రామం అమర్‌నగర్ వాసులు సోమవారం ప్రస్తుత తహసీల్దార్ నాగార్జునరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమర్‌నగర్ వాసులు మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబర్ 163/అ/1/1లో 1983వ సంవత్సరంలో భూమిని కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నామని తెలిపారు. ఆ ఇళ్లకు నంబర్లు ఉన్నాయని, పన్ను కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. ఆ భూమిలో సుమారు 2 ఎకరాలను గత ఏడాది జూలై 28వ తేదీన వ్యవసాయ భూములుగా మార్చి గరిడేపల్లి మండలం కొండాయిగూడెం గ్రామానికి చెందిన కేతిరెడ్డి కోటేశ్వరమ్మకు హుజూర్‌నగర్ మాజీ తహసీలార్ధ్ వజ్రాల జయశ్రీ ధరిణిలో రిజిస్ట్రేషన్ చేసిందని ఆరోపించారు. తహసీల్దార్‌పై చర్య తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. దీని ప్రతులను ఆర్డీఓ, ఎస్‌బికి ఇచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో శరత్‌కుమార్, నవీన్, సత్యనారాయణ, పద్మ, నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి సీపీఎం మద్దతు

మోతె : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో మతతత్వ బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాసన మండలి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. పట్టభద్రులు కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి గోపాల్ రెడ్డి, గుంటగాని ఏసు, కొండ శ్రీరాములు, గురిజా వెంకన్న, ఇండ్ల వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మట్టిపల్లి సైదులు

విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని నివారించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని నివారించాలని హుజూర్‌నగర్ మండలంలోని కరక్కాయలగూడెం గ్రామస్తులు సోమవారం కోరారు. మండలంలోని బూరుగడ్డ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కరక్కాయలగూడెం గ్రామానికి వచ్చే సింగిల్ ఫేజ్ లైన్‌ను రూ.15 లక్షలతో ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ లైనుకు విద్యుత్ సరఫరా మధవరాయినిగూడెం, మద్రిగూడెం మీదుగా సరఫరా చేస్తుండడంతో విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయం కలుగుతోందని తెలిపారు. సింగిల్ ఫేజ్ లైన్ ప్రారంభించి రోజులు గడుస్తున్నా విద్యుత్ అధికారులు మాత్రం ఆ లైనుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. అధికారులు తక్షణమే సింగిల్ ఫేజ్ లైన్‌కు విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరారు.

అన్నదాన సత్రానికి రూ.99వేల విరాళాలు

గరిడేపల్లి :మఠంపల్లి మండలం మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనర్సింహ్మస్వామి ఆలయం వద్ద గల విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రానికి దాతల ద్వారా ఈనెల 19వ తేదీ వరకు రూ.99 వేల వరకు విరాళాలు వచ్చాయని అన్నదాన సత్రం నిర్వాహకులు సోమవారం తెలిపారు. సత్రం అభివృద్ధికి మరింత సహాయ సహకారాలను అందించాలని విశ్వబ్రహ్మణ నిత్య అన్నదాన సత్ర కమిటీ కార్యవర్గ సభ్యులు కోరారు. అన్నదాన సత్రానికి విరాళం అందించిన దాతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీకి పెరుగుతున్న ఆదరణ

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని

పెన్‌పహాడ్ : రాష్ట్రంలో కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, బీజేపీకి ఆదరణ పెరుగుతోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోసం సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి ఓటేసి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కచ్చితంగా 400సీట్లు సాధించబోతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. రాష్ట్రంలోని అధికార పార్టీని ఆదరిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడేవారు ఉండరని అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, పార్టీ మండల అధ్యక్షుడు పోకల రాములు, మధు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

మత్స్య సహకార సంఘం సభ్యుడికి నివాళి

మునగాల: మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మత్స్య సహకార సంఘం సభ్యుడు దేశగాని జోగయ్య మృతి బాధాకరమని మాజీ జెడ్పీటీసీ కోల ఉపేందర్‌రావు అన్నారు. ఇటీవల అనారోగ్యం బారిన పడి మృతిచెందిన జోగయ్య దశదిన కర్మలో సోమవారం ఆయన పాల్గొన్నారు. తొలుత జోగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బిట్టు లింగయ్య, బీఆర్ఎస్ గ్రామశాఖ కార్యదర్శి కోల ఆంజనేయులు, నాయకులు కోల శ్రీరాములు, కోల జోగయ్య, దేశగాని పాపయ్య, ములావత్ శ్రీను, మత్స్య సహకార సంఘం సభ్యులు కత్తి శ్రీను, వీరమల్ల వెంకటేశ్వర్లు, మొలుగూరి సైదులు, పాపయ్య, గురవయ్య, సర్వయ్య, లింగయ్య పాల్గొన్నారు.



జోగయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపేందర్‌రావు తదితరులు

చెరువు శిఖం ఆక్రమించారు

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురం చెరువు శిఖం భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ మత్స్యకార సంఘం అధ్యక్షుడు కొప్పెర వెంకటేశ్వర్లు అధికారులను కోరారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. 1980లో సొసైటీ ఏర్పడిన నాటి నుంచి ఆ చెరువులో చేపలను పెంచుకుంటూ ఉపాధి పొందుతున్నామని తెలిపారు. పలువురు రైతులు కావాలని రూ.లక్షల విలువ చేసే చెరువు శిఖం భూమిని ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు భూమి తగ్గడం వలన నీటి నిల్వ తగ్గుతుందన్నారు.

నేడు జలగం జనార్దన్ వర్ధంతి సభ

భానుపురి : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ప్రతిఘటన పోరాట యోధుడు జలగం జనార్దన్ (జెన్ను సార్) వర్ధంతి సభను మంగళవారం సూర్యాపేటలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడిత ప్రజల పక్షాన జెన్ను సార్ అనేక ప్రజా ఉద్యమాలు చేశాడని అన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. నేడు ఉదయం 10 గంటలకు జరిగే సభలో అభిమానులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, నాయకులు కునుకుంట్ల సైదులు, సామ నర్సిరెడ్డి, పుల్లూరి సింహాద్రి, వీరబోయిన రమేష్, బోల్క పవన్, పిడమర్తి భరత్, ఎస్‌కే రహీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డేవిడ్‌కుమార్

ఫ్యాన్లు సమకూర్చడం అభినందనీయం

సూర్యాపేటటౌన్ : పాఠశాలకు ఫ్యాన్‌లు అందించడం అభినందనీయమని సుధాకర్ పీవీసీ ప్రొడక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ అన్నారు. అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఏవీఎం పాఠశాలకు రూ.10వేల విలువల గల ఫ్యాన్‌లను అందించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోట్ల ఆస్తుల కన్నా సామాజిక సేవలు మిన్న అని తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యాస రాంకుమార్ రెడ్డి, ఉప్పు నాగయ్య పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్లొస్తూ..

- రోడ్డు ప్రమాదంలో డాక్టర్ దుర్మరణం

హుజూర్‌నగర్ : రోడ్డు ప్రమాదంలో ఓ డాక్టర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ శివారులోని బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. ఏఎస్ఐ బలరామిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ (43) సోమవారం ఉదయం బైక్‌పై మేళ్లచెర్వు మండలంలోని దొండపాడు గ్రామంలో బంధువుల ఇంట్లో నిర్వహిస్తున్న శుభకార్యానికి హాజరయ్యాడు. శుభకార్యం అనంతరం అర్ధరాత్రి బైక్‌పై హుజూర్‌నగర్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో పట్టణ కేంద్రం శివారు బైపాస్ రోడ్డు పక్కన తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. స్థానికులు గమనించి అతడిని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీకాంత్ చీకట్లో గేదెను ఢీకొని ప్రమాదానికి గురైనట్లు భావిస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు. మృతుడి స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందినవాడుగా తెలిసిందని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మునగాల: మండలంలోని ముకుందాపురం గ్రామ పంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో సోమవారం నడిగూడెం మండల కేంద్రానికి చెందిన ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాల్లో సీసీ నిఘా

- పంటల పర్యవేక్షణకు సీసీ కెమెరాలు అమర్చుకున్న రైతులు
- నడిగూడెం మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు

నడిగూడెం: నేటి ఆధునిక యుగంలో నేరాల నియంత్రణలో కీలకపాత్ర పోషిస్తున్న సీసీ కెమెరాల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటి వరకు ఇళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, బ్యాంకులు, అపార్ట్‌మెంట్‌లు, పరిశ్రమల్లో అమర్చుతూ వస్తున్న సీసీ కెమెరాలను నిరంతర నిఘా కోసం వ్యవసాయ క్షేత్రాల్లోనూ ఏర్పాటు చేసుకుంటున్నారు నడిగూడెం మండలానికి చెందిన కొందరు రైతులు. నడిగూడెం మండల కేంద్రంతో పాటు, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, రామాపురం, రత్నవరం, కాగితరామచంద్రాపురం, చెన్నకేశ్వాపురం, వేణుగోపాలపురం, చాకిరాల, తెల్లబల్లి గ్రామాలకు చెందిన పలువురు ఆదర్శ రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ తమ వ్యవసాయ క్షేత్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి విజువల్స్‌ను సెల్‌ఫోన్లకు అనుసంధానం చేసుకొని ఇంటి వద్ద నుంచే పంటలతోపాటు అక్కడ ఏమి జరుగుతుందో పుటేజీల ద్వారా చూసుకుంటూ తమ సాగు పనులు చక్కబెట్టు కుంటున్నారు. ఇంకొందరైతే చేపల కుంటలు, కోళ్ల పరిశ్రమల వద్ద కూడా సీసీ కెమెరాలు పెట్టి వాటిని పర్యవేక్షిస్తున్నారు.

కెమెరాల ఏర్పాటు ఇలా..

చాలామంది రైతులు విద్యుత్ అవసరం లేకుండా సోలార్ సీసీ కెమెరాలను తమ వ్యవసాయ క్షేత్రాల్లో అమర్చుకుంటున్నారు. అయితే సోలార్ సీసీ కెమెరాలకు ఒక్కోదానికి మార్కెట్‌లో రూ.7,500 నుంచి రూ.12,500 చొప్పున ధర పలుకుతుంది. ఇవి నిరంతరం పని చేస్తాయి. ప్రతి సీసీ కెమెరాకు ఒక సిమ్ తప్పనిసరిగా ఉపయోగించాల్సి ఉంటుంది. అందులో చిప్ సామర్థ్యాన్ని బట్టి 15–30 రోజుల పుటేజీని నిక్షిప్తం చేసుకోవచ్చు. ఇక, విద్యుత్‌తో నడిచే సీసీ కెమెరాలు ఎన్ని అమర్చినా ఒకసిమ్ సరిపోతుంది. ఇలా ఏర్పాటు చేసుకున్న అన్ని సీసీ కెమెరాలను అనుసంధానించి ఒకచోట మానిటర్ పెట్టుకోవచ్చు. ఇందుకు ఇన్వర్టర్ బ్యాటరీలు అవసరమవుతాయి.

ఉపయోగాలివే..

- చీడపీడలు ఆశించినప్పుడు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇంటి వద్ద నుంచే పంటల పరిస్థితిని తెలుసుకొనే అవకాశముంది.
- పంట పొలాల వద్ద మోటార్లు, ఇతర యంత్ర సామగ్రిని ఎవరైనా అపహరిస్తే పుటేజీలను పరిశీలించి వారిని పట్టుకోవచ్చు.
- పంట ఉత్పత్తులను కాపాడుకోవడంతో పాటు కూలీలు చేసే పనులను పర్యవేక్షించవచ్చు.
- వ్యవసాయ క్షేత్రాల్లోకి పశువులు, పక్షులు, కోతులు ఇతరత్ర జంతువులు వచ్చినప్పుడు సీసీ పుటేజీల ద్వారా గమనించి వాటి నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు.



నడిగూడెం మండలం సిరిపురంలో శేషుకుమార్ వ్యవసాయ క్షేత్రం



వ్యవసాయ క్షేత్రాన్ని సెల్‌ఫోన్ ద్వారా చూస్తున్న రైతు



వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

ఇంటివద్ద నుంచే పర్యవేక్షిస్తున్నా..



మా గ్రామ సమీపాన ఉన్న 1.50 ఎకరం విస్తీర్ణంలో ప్రత్యేక షెడ్ నిర్మించి దానిలో గొర్రెలు, నాటు కోళ్లు, 40 రకాల పండ్లు, కూరగాయలు, గడ్డిజాతి పంటలను సాగు చేస్తున్నాను. నా వ్యవసాయ క్షేత్రం చుట్టూ పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాను. ఆ సీసీ కెమెరాలకు ఇంటర్నెట్‌తో అనుసంధానం చేయడంతో పాటు సెల్‌ఫోన్‌లో ఇంటి నుంచే పంటలను పర్యవేక్షిస్తున్నాను. సీసీ కెమెరాల ఏర్పాటుతో మాటిమాటికి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాల్సిన బాధ తప్పింది.

– వాసికర్ల శేషుకుమార్, రైతు, సిరిపురం

మొక్కలు ఎండిపోకుండా చూడాలి : ఏపీఓ

అర్వపల్లి : తెలంగాణ సంపద వనాల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఉపాధిహామీ పథకం ఏపీఓ చిలుక ఉపేందర్ కోరారు. సోమవారం అడివెంల గ్రామంలోని సంపద వనాన్ని పరిశీలించారు. కొన్ని మొక్కలు ఎండిపోగా వాటి స్థానంలో మళ్లీ కొత్త మొక్కలు నాటించి నీళ్లు పోయించారు.

ఏపూర్ వాసికి డాక్టరేట్



పూర్ణాచారి

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ఏపూర్ గ్రామానికి చెందిన మునిగడప పూర్ణాచారి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఓయూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆదిలక్ష్మి పర్యవేక్షణలో ‘నో వెల్ డీప్ లెర్నింగ్ అప్రోచెస్ ఫర్ ఎవాల్యుయేటింగ్ మార్క్స్’ అంశంపై డాక్టరేట్ సాధించినట్లు పూర్ణాచారి తెలిపారు.

- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నడిగూడెం మండలం శ్రీరంగాపురంలో సమావేశమైన శ్రీ కొల్లు కోటయ్య మెమోరియల్ స్కూల్ 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు